క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేశవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికతో సమావేశానికి హాజరుకావాలన్నారు. అదే విధంగా మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

సజావుగా మండల మీట్



రొద్దంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండలాధ్యక్షురాలు నాగమ్మ అధ్యక్షతన, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్ కుమార్ ఆధ్వర్యంలో మండల మీట్ జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయిలోని ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. గతంతో పనిచేసిన, చేయాల్సిన పనులు, అభివృద్ధిపై చర్చించారు. శ్యాపురం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే పూడ్చడానికి శ్మశాన వాటిక లేదని ఎంపీటీసీ రామేష్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు గ్రామాన్ని పరిశీలించి స్థలం కేటాయిస్తామని చెప్పారు. పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



మెడల్స్, ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని బ్రిలియన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ నెల 14న కర్నూలులో జరిగిన 12వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ కృష్ణవేణి తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ప్రథమస్థానంలో సలోనికుమారి, ద్వితీయ స్థానంలో శ్రీకుల్వంత్, మల్లేష్ నాయక్, తృతీయ స్థానంలో ప్రవీణ్య, లలిత, హర్షిణి నిలిచారన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

- చాణిక్య యూనివర్సిటీ చాన్సలర్, పద్మశ్రీ ఎంకే శ్రీధర్



పద్మశ్రీ ఎంకే శ్రీధర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: విద్య ఉంటే ప్రపంచంలో ఎక్కడికెళ్లినా గౌరవించబడతారని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చాణిక్య యూనివర్సిటీ వ్యవస్థాపకులు, చాన్సలర్, న్యూ నేషనల్ ఎడ్యుకేషన్ రీఫార్మ్స్ మెంబర్ ఎంకే శ్రీధర్ అన్నారు. పట్టణంలోని సరస్వతీ విద్యామందిరంలో సోమవారం పద్మశ్రీ ఎంకే శ్రీధర్ జన్మదినాన్ని నిర్వహించారు. సహచర ఉద్యోగులు, స్నేహితులు, విద్యార్థులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. శ్రీధర్ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. సరస్వతీ విద్యామందిరం రాయలసీమ కార్యదర్శి రాధాకృష్ణ , వాణిజ్య అల్యూమిని బెంగళూరు ప్రెసిడెంట్ పరమేశ్వర విజయ, రిటైర్డ్ లెక్చరర్ జగదీష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగి ఆవేదన సదస్సు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హిందూపురం: నిరుద్యోగ యువతను ఆకర్షించేందుకు ఎన్నికలకు ముందు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికొదిలేసి కూటమి ప్రభుత్వం నిరుద్యోగులు, యువత జీవితాలను నాశనం చేస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ కమల్‌బాషా విమర్శించారు. అఖిల భారత యువజన సమైక్య ఆధ్వర్యంలో సోమవారం సీపీఐ పార్టీ ఆఫీసు దగ్గర నిరుద్యోగి ఆవేదన సదస్సు పోస్టర్లు విడుదల చేశారు. ఈనెల 17న విజయవాడలో నిర్వహించనున్న నిరుద్యోగి ఆవేదన సదస్సుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణం సమితి అధ్యక్షులు.జిలాన్‌బాషా, కార్యదర్శి నూర్ మొహమ్మద్, సహాయ కార్యదర్శి ఫైరోజ్, ఉపాధ్యక్షుడు జిలాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల మధ్య సేవా కేంద్రం



మణూరులో రైతు సేవా కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మణూరు పంచాయతీ కేంద్రంలోని రైతు సేవా కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగడంతో కేంద్రంలోకి వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర అంటూ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా మణూరులో మాత్రం ప్రభుత్వ కార్యాలయం వద్దనే పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగుల సంచారం కూడా ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని పంచాయతీ కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని కోరుతున్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



ఆవుతో ఉన్న రెండు దూడలు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో రైతు అనిల్‌కుమార్‌కు చెందిన పాడి ఆవు రెండు దూడలను ఈనింది. సోమవారం తెల్లవారుజామున ఆవు ఒక మగ, ఒక ఆడ దూడలకు జన్మనిచ్చిందని రైతు తెలిపారు. రోజుకు రెండు పూటల కలిపి 30 లీటర్ల పాలు ఇస్తోందని అనిల్ తెలిపారు. పాడి ఆవుతో పాటు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. సాధారణంగా ఒక ఆవు ఒక దూడ ఈనుతుందని, అయితే ఈ ఆవు రెండు దూడలను ఈనిందన్నారు. గ్రామంలోని వారు ఆవుతో పాటు దూడలను చూసి హర్షం వ్యక్తం చేశారు.

ఆగిన అర్బన్ హెల్త్ సెంటర్ పనులు



మధ్యలోనే ఆగిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ పనులు

పెనుకొండ: పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్ పనులు ఆగిపోవడంతో ప్రజలకు సత్వర వైద్య సేవలు అందడం గగనంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్బన్ హెల్త్ సెంటర్ మంజూరు కాగా అధికారులు పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం ఈ భవనం గురించి పట్టించుకోకపోవడంతో మెరుగైన వైద్య సేవలకు ప్రజలు దూరమయ్యారు. ప్రస్తుతం అన్ని సేవలు సర్వజనాస్పత్రిలోనే పొందాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టి అర్బన్ హెల్త్ సెంటర్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

తిమ్మగానిపల్లిలో పరిసరాలు శుభ్రం



ఎస్సీ కాలనీలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

లేపాక్షి: మండలంలోని తిమ్మగానిపల్లి గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రతపై 'తిమ్మగానిపల్లిలో కంపు.. కంపు' అన్న శీర్షికన 'సాక్షి'లో ప్రత్యేక కథనం సోమవారం ప్రచురితమైంది. దీనికి సర్పంచ్ సిద్ధార్థతో పాటు ఈఓఆర్డీ నాగరాజు, పంచాయతీ కార్యాదర్శి రమేష్‌బాబు స్పందించారు. గ్రామాన్ని సందర్శించి డ్రైనేజీలు, పరిసరాలను పరిశుభ్రం చేయించారు. అదేవిధంగా జేసీబీతో పిచ్చిమొక్కలు, కంప చెట్లును తొలగించి శుభ్రంగా ఉంచారు. దీంతో గ్రామంలో పరిసరాలు పరిశుభ్రం చేయడంతో గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

'మోక్షగుండం' ఆదర్శప్రాయుడు



హిందూపురం: మున్సిపల్ ఇంజనీర్లను సత్కరిస్తున్న సిబ్బంది



బీటీఐ కాలేజీలో..

హిందూపురం టౌన్: నేటితరం ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునలు అన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హిందూపురం: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని హిందూపురం బీటీఐ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానసిక నిపుణులు, మోటివేటర్ డాక్టర్ శివరామ ప్రసాద్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

మడకశిరరూరల్/మడకశిర: మండల పరిధిలోని టీడీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం భూతన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మడకశిర పట్టణంలోని పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంలో ఇంజినీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం చిత్ర పటానికి పూలమాల వేసి ఇంజినీర్లు నివాళులర్పించారు. పీఆర్ డీఈ వెంకటేశులు, జేఈలు విశ్వనాథ్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వక్క చెట్ల నరికివేత

పావగడ: తాలూకాలోని బెల్లిబట్లులోని రైతు దయాకరరెడ్డికి చెందిన 15 వక్క చెట్లను దుండగులు ఆదివారం రాత్రి నరికి వేశారు. పోలీసులు నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

జూదరుల అరెస్టు

హిందూపురం: మండలం తూమకుంట చెరువు వద్ద జూదం ఆడుతున్నా ఆరుగురిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ ఆంజనేయులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,280 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తప్పిన ప్రమాదం

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి థామస్ మన్రో కోడూరు తోపు వద్ద సోమవారం ఎస్ఆర్‌సీకి చెందిన టిప్పర్ ఇద్దరు విద్యార్థులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. టిప్పర్ .. బొలెరోతో పాటు మరో కారును ఢీకొందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయుల నిరసన బాట



పెనుకొండలో ఆర్డీఓకు వినతిపత్రమిస్తున్న దృశ్యం



మడకశిరలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ: పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు జిల్లా కౌన్సిలర్ జే.త్రిమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కౌన్సిలర్ మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. నాయకులు గాజుల గోపాల్, వెంకటరమణానాయక్, ఆంజనేయులు, చంద్రమౌళి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రెసిడెంట్ కొనంకి అశోక్‌కుమార్, జిల్లా కార్యదర్శులు లతారామకృష్ణ, అంజనమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ గవ్వల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు యంజారప్ప, శ్యాంసుదర్, మండల అధ్యక్షుడు సిద్ధార్థ ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందించారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనతకు చెక్

లేపాక్షి: విద్యార్థులు పౌష్టికాహారాన్ని సమతుల్యంగా తీసుకున్నప్పుడు అనారోగ్యం బారిన పడకుండా, రక్తహీనతకు గురికాకుండా ఉంటారని హిందూపురం ఐసీడీఎస్ సీడీపీఓ వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఉదయం మండలంలోని శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనీమియాపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. వరలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించినప్పుడు రక్తహీనతకు దూరంగా ఉంటారన్నారు. సఖి సెంటర్ సిబ్బంది ఉమాదేవి, జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ శివలత , హెచ్‌ఎం శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీపై రైతుల అసంతృప్తి

పెనుకొండ: మండలంలో సోమవారం యూరియా పంపిణీ సజావుగా జరిగింది. తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు ఇతర అధికారుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ జరిగింది. మండలంలోని శెట్టిపల్లిలో 9.9 మెట్రిక్ టన్నులు, రాంపురంలో 9.9 మెట్రిక్ టన్నులు, పట్టణంలోని శివసాయి ఫర్టిలైజర్ షాపులో 9.9 మెట్రిక్ టన్నుల యూరియాను అధికారులు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఒక్క ప్యాకెట్ యూరియాను మాత్రమే అందించారు. అదనపు బస్తాల కోసం రైతులు ప్రయత్నించినా అధికారులు ఒప్పుకోలేదు. దీంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

భూములు వెనక్కి ఇవ్వాలని రైతుల ధర్నా



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మడకశిర: మడకశిరలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు సోమవారం ధర్నా చేశారు. తమ భూములను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. మడకశిర మండలంలో పరిశ్రమల ఏర్పాటు పేరుతో ప్రభుత్వం సీకొడిగేపల్లి, నల్లాయనపల్లి, కేతేపల్లి, కల్లుమర్రి గ్రామాలకు చెందిన రైతుల భూములను సేకరించింది. అయితే ఇంత వరకూ ఎలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేయలేదని, అందుకే ప్రభుత్వం తమ భూములను వెనక్కి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సాగుల్లో ఉన్న భూములకు అధికారులు పంట నమోదు చేయాలని రైతులు కోరారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు సీఆర్ రెడ్డి, రమేష్, కొల్లారప్ప, వెంకటరమణప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ,కే వీపీఎస్ జిల్లా నాయకులు రామాంజనేయులు, యోగానంద్, రవి, ముత్యాలప్ప పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం



మాట్లాడుతున్న వైఎస్ రవిశేఖర్‌రెడ్డి

మడకశిర: కూటమి ప్రభుత్వం వృథా ఖర్చులను తగ్గించుకుని మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైద్య విద్యను ప్రైవేట్ పరం చేస్తే పేద విద్యార్థులకు అన్యాయం జరగడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర ఒక రోజు కార్యక్రమానికి రూ.350 కోట్లు వృథాగా ఖర్చు చేసిందని, అలాగే ప్రకటనల పేరుతో రూ.900 కోట్లను బూడిదలో పోసిన పన్నీరులా మార్చారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే రూ.1.98 లక్షల కోట్ల అప్పులు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. ఈ అప్పుల్లో రూ.4 వేల కోట్లను ఖర్చు చేసి మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధీనం నిర్వహించలేరా? అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు.

సీసీ కెమెరాల వితరణ



సీసీ కెమెరాలు అందిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని నింకంపల్లిలో వెలసిన యల్లమ్మదేవి ఆలయానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక నాలుగు సీసీ కెమెరాలను వితరణ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు కెమెరాలు అందించారు.

ఇరువర్గాల ఘర్షణ


గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి తండాలో సోమవారం సాయంత్రం విద్యుత్‌శాఖ ఉద్యోగి జయరాంనాయక్, ఆయన సమీప బంధువు శీనానాయక్ వర్గాలు సోమవారం ఘర్షణ పడ్డాయి. భూ సమస్యతోనే ఘర్షణకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఘటనలో శీనానాయక్ భార్య జయబాయికి గాయాలయ్యాయి. ఆమెను గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జయబాయి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త సమాచారం

తహసీల్దార్‌ను నియమించండి

చిలమత్తూరు: మండలానికి శాశ్వత తహసీల్దార్‌ను నియమించాలని సీపీఐ రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోవింద్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, తిప్పన్న, రామచంద్ర, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

మెట్రో షూమార్ట్ అధినేత కన్నుమూత



హరినాథ్‌రెడ్డి(ఫైల్)

హిందూపురం: పట్టణానికి చెందిన మెట్రో షూ మార్ట్ అధినేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్నిహితుడు హరినాథ్‌రెడ్డి అనారోగ్యంతో ఆదివారం రాత్రి కన్నుమూశారు. అన్నమయ్య జిల్లా చెరుకువారిపల్లికి చెందిన హరినాథ్‌రెడ్డి 30 ఏళ్ల క్రితం హిందూపురానికి ఉపాధి కోసం వచ్చారు. ప్రైవేట్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా చేరి అంచలంచెలుగా ఎదిగి పట్టణంలో పెద్ద షూ మార్ట్‌ను ప్రారంభించారు. ఆయన అకాల మరణంతో పట్టణానికి చెందిన ప్రముఖులు, ప్రజలు సంతాపం తెలిపారు.

మద్యం అక్రమ రవాణాకు చెక్



రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

చిలమత్తూరు: సరిహద్దు చెక్‌పోస్ట్‌లపై ప్రత్యేక నిఘా ఉంచి కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.

ఘనంగా హిందీ దివస్



మోదాలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పరిగి/హిందూపురం: జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని సోమవారం పరిగి మండలంలో పలు విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. మోదాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించుకున్న హిందీ ఉపాధ్యాయురాలు డాక్టర్ హెబ్సీబాగ్రేస్ సన్మానించారు. అనంతరం పాఠశాలకు రూ.20 వేల విలువైన పోడియంను విరాళంగా అందజేశారు. మరోవైపు హిందూపురం పట్టణంలోని బాలాజీ కళాశాలలో ప్రిన్సిపల్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఉచిత విద్యుత్ అమలు చేయాలి

సోమందేపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. నాయకులు నారాయణస్వామి, కిష్టప్ప, సుధాకర్, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి రామ్లానాయక్‌పై వేటు

చిలమత్తూరు: చిలమత్తూరు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కార్యదర్శి రామ్లానాయక్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. ఇదిలా ఉంటే రామ్లానాయక్‌పై ఒత్తిడి తీసుకువచ్చి సుమారు రూ. 50 లక్షలు బిల్లులు మంజూరు చేయించుకున్న టీడీపీ నేతపై ఆ పార్టీ అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అవినీతిని టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రోత్సహిస్తున్నారని, అందుకే తప్పు చేసి ప్రజాధనం లూటీ చేసిన టీడీపీ నేతలను వెనుకేసుకొస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.

బయోమెట్రిక్ డివైస్‌ల పంపిణీ

మడకశిర: నియోజకవర్గంలో స్వయం సహాయక మహిళా సంఘాల పరిధిలో పని చేస్తున్న వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు)లకు సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బయోమెట్రిక్ డివైస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ సమీపంలోని 544ఈ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి లక్ష్మీ అనే మహిళ ద్విచక్ర వాహనంలో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడింది. హుటాహుటిన ఆమెను కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరులోని ఆస్పత్రికి తరలించినట్లు లక్ష్మీ భర్త ప్రదీప్ తెలిపారు. టోల్‌ప్లాజా వద్దకు వెళ్తుండగా ఈ ఘటన జరిగిందన్నారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

రొళ్ల: పట్టణంలో వివిధ లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రీ తెలిపారు. అనధికారిక లేఔట్లతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

చెత్త సేకరణకు వీల్ బారోస్

హిందూపురం టౌన్: వార్డుల్లో చెత్త సేకరణ కోసం ప్రత్యేకంగా 43 వీల్ బారోస్ కొనుగోలు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కొనుగోలు చేసిన సంబంధిత వీల్ బారోస్ వారు పరిశీలించారు.

'రణభేరి'పోస్టర్ల ఆవిష్కరణ

పరిగి: యూటీఎఫ్ ఈనెల 15 నుంచి తలపెట్టిన రణభేరితో ప్రభుత్వ కళ్లు తెరిపించాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు.